# ఎడా - పెడా

ఎవరండీ అది? ఎందుకూ, వస్తున్నా నంటుంటేనే అల్లా తలుపు పగల గొడతారు ? వచ్చి తలుపు తీద్దునుగదా మాట లేకుండా రాతిబొమ్మలాగా నిలబడతారేం ? ఎవరు మీరు ఎక్కడనుంచి వచ్చారు. కదలరూ, మెదలరూ, నాతో మీకేం పనివచ్చింది. బాబూ ? మీ నోటికేమైన అడ్డుపడిందా యేమిటి ? అసలు మీకు మాటలేరావా ఏమిటి ? మీ రెవరండీ బాబూ ? మీ పేరేమండీ అంటే బదులు చెప్పక బెదురు చూపులు చూస్తారేమిటి ? ఏం పనిమీద వచ్చారో చెప్పండి, చెప్పకపోతే ఏం తెలుస్తుంది ? పరాయి మగవాళ్లు వచ్చి మూగగా వాకిటిముందు నిలబడితే యేమనుకోవాలి ? ఏదో చప్పున చెప్పండి. నాకు చెయ్యి విడిలేదు. మా రామం వచ్చే వేళవుతోంది. అప్పటిదాకా మీ రిల్లాగే కొయ్యలాగా నిలబడ్డారా అంటే ఇవ్వాళ యేదో పెద్ద రాద్ధాంతం జరుగుతుంది.

ఏమిటండోయ్, మీకేమైనా మతిపోయిందా ? వొళ్ళు దగ్గరపెట్టుకుని మాట్లాడండి. ఇక్కడే మా రామం వుంటే ఈ పాటికీ మీ భరతం పట్టేవాడు. పరాయివాళ్లు అమాంతంగా నన్ను "ఏమే సుందరీ" అని పిలవటమా ? ఎన్ని గుండెలున్నయ్ ? తగినశాస్తి జరుగుతుందండోయ్. ముక్కూ ముఖమూ యెరగని మీరు నన్ను యేమే అనటమా ? ఈ క్షణందాకా మీరు మీరని మన్నిస్తున్నందుకు నా కది ప్రాయశ్చిత్తమా ? జాగర్తగా రానీవ్వండి మాటలు. ఎవరనుకున్నారో ?

రామం. రా నాయనా సరిగా వేళకి వచ్చావు. ఈ మనిషి యెవరో కాస్త కనుక్కో. పేరు చెప్పమంటే కళ్లు అప్పగించి నీళ్ళు నములుతున్నాడు. పైగా నన్ను పట్టుకొని యేమే సుందరీ అంటున్నాడు ఆ తిమ్మిరి కొంచెం అణగగొట్టు. అక్క కి ఇంత పరాభవం జరిగితే తమ్ముడివై చూస్తూ ఊరుకుంటావా ?

నీకూ్కడా మతిపోయిందా యేమిటె రామం ? ఈ మనిషి నా భర్తా ? ఈయనేనా నా మెళ్ళో పుస్తెకట్టింది ?

ఇరవై యేళ్ళు నాకేసి తిరిగిచూడని భర్తకి ఇవాళ నాతో ఏం పని వచ్చిందో కనుక్కో ? ఆ మనిషి ఇష్టం వచ్చినప్పుడు రమ్మని, కష్టం వచ్చినప్పుడు పొమ్మనీ అంటే అన్నిటికీ తందానా అంటాననుకున్నారేమో ! ఆ ఆటలు నా దగ్గర సాగవని చెప్పు. ఇన్నేళ్ళు బతికున్నానో, చచ్చిపోయానో కనుక్కోని మనిషికి ఇవాళ నాతో ఏం పని వచ్చిందో నిగ్గదియ్యి. అసలు ఈ మనిషి నా భర్త అని దాఖలా యేది ? నాకు ఒక్కసారి అయినా ఈ ముఖం చూసిన గుర్తు లేదు. అయిదేళ్ళ పిల్లగా వున్నప్పుడు పెళ్ళిలో ఆయన బుగంమీసాలుచూచి బూచివాడని బెదిరిపోయి పల్లకీ యెక్కననిమారాం చేశానట. మిఠాయిపొట్లం చేతికిస్తే పల్లకీలో తింటూ నిద్రపోయానట. అంతే ఆ మనిషితో నాకున్న సంబంధం. ఆయన ముఖమెటువంటిదోకూడా నే నెరగను. మా నాన్నకీ వాళ్ళ నాయనకీ ఏదోమాటా పట్టింపు వచ్చింది. అంతే. వాళ్ళగడప మేమూ, మాగడప వాళ్ళూ తొక్కలేదు.

అటువంటి మనిషికి అమాంతంగా ఇంత ఉపద్రవమైన అపేక్ష యెందుకు పుట్టుకువచ్చిందో కనుక్కో రామం.

ఏమండోయ్ అసలు సంగతేమిటో బైటపెట్టండి. మీరు మళ్ళీపెళ్ళి చేసుకుని అప్పుడే పదిహేనేళ్ళయింది గదా ? బిడ్డా, పాపా, భార్యా, ఇల్లూ, వాకిలీ, అన్నీ సజావుగా వున్నయ్ గదా ? అయితే తమరిక్కడికి యెందుకు వేంచేశారో కాస్త సెలవిప్పించాలి. అంతకుముందు నే నొకమాట చెబుతాను. అది బాగా మనసుకి పట్టించుకోండి. మీరు మీ వాకిట్లో పెట్టే బిచ్చంమీద బతకవలసిన అవసరం లేదు. కొంచెమో గొప్పో చదువుకున్నాను. నలుగురు పిల్లలకి పాఠాలు చెప్పుకుంటే నాబతుకు గడిచిపోతోంది. అన్నంకోసం నేను మీ యింటికి రావలసిన అవసరం నా కేమీ కనబడటం లేదు.

తెలిసిందిరోయ్ రామం, మీరు ఇక్కడికి ఊరికే రాలేదు. ఇదంతా ఒక పెద్ద యెత్తు. ఇంకేముంది అంతా తెలిసిపోయింది. ఏమండోయ్ "మనోవర్తి" దావా వేశాననీ, తీర్పు నా పక్షమయిందనీ, ఇప్పుడు నన్ను తమవెంట ఇంటికి తీసుకుపోతే అది ఇవ్వక్కర్లేదనీ—అబ్బో ఏంపన్నాగమండీ ! నిజంగా బృహస్పతి కున్నంత తెలివి వుందండీ మీకు. చూశావా, రామం, ఆ మనిషి ముఖమెల్లా వెలవెలబోతున్నదో, పాపం. నేను అవలిస్తే పేగులు లెక్కపెట్టగలనని ఆయనకు తెలియదు. తమ మంత్రం పారుతుందనీ ఆశపడి కల్లబొల్లి మాటలతో నన్ను వలలో వేసుకుపోదామని వచ్చారు.

బృహస్పతులవారూ, ఇక తమరు వచ్చిన దోవనదయ చేయవచ్చు. నామీద మీ మంత్రం పారదు. మళ్ళీపెళ్ళి చేసు

కుని సుఖంగా వున్నారు. నేను వచ్చి మీ ఇద్దరి జీవితంలోనూ పానకంలో పుడకనౌతానా? అదియెన్నడూ జరగదు. ఇక నా సంగతి అంటారా? ఇన్నేళ్లు ఒంటెరిగా బతికినదాన్ని ఇక ముందూ అల్లాగే బతకగలను. ఇప్పు డెందుకు నాకు కాపుర మనే లేనిపోని బెడద? నా పొట్ట నేను పోసుకుంటాను. నా వొంట్లో వూపిరి వున్నంతవరకూ నేను చదువుకుంటూ నలుగురికి చెపుతూ కాలం వెళ్ళదీస్తాను. ఏమైనాసరే నేను మీతో రాను. అయితే మిమ్మల్నొక మాట అడుగుతాను. దానికే బదులు చెప్పండి. నేనూ మీలాగే మళ్లీ ఎవరినైనా పెళ్ళాడితే? మాట్లాడరేం? పురుషుడు యేది చేసినా సమాజం పక్కనతాళం వేస్తుంది. అదే గనక స్త్రీ చేస్తే ప్రళయంలాగా విరుచుకుని పడుతుంది. మీకు మళ్లీ పెళ్ళి యెంత అవసరమో నాకూ అంతే కదా? అయితే నేను చేసుకుంటే అంత తప్పు పట్టేస్తారేం? నేను కూడా మళ్ళీ చేసుకోబోతున్నాను. మీతో వచ్చి కాపురం చెయ్యను. తమరు ఇంటిదోవ పట్టవచ్చు. చూశావా, రామం, ఆ మనిషి యెంత తలకిందులై పోతున్నారో? తను మళ్ళీ పెళ్ళాడి పిల్లల్ని కనటం బాగుంది. ఆ పని నేను చేయబోతున్నానంటే యెల్లా వెలిసిపోతున్నారో చూడు.

ఇక నిశ్చింతగా వెళ్ళండి స్వామీ. ఊరికే మిమ్మల్ని నవ్వించటానికి అన్నానుగాని ఇప్పుడు నన్ను పెళ్ళిచేసుకునే బుద్ధిమంతు డెవరు? అయినా నాకు పెళ్ళేమిటి. పేరంటమేమిటి? నేను మీతో ఒక్కనాడయినా భార్యగా బతకలేదు. నిజానికి అయిన బతికున్నంతకాలమూ మీ భార్యగానే, మీ ఇంటి పేరుతోనే బతుకుతాను. మీ పేరు చెప్పుకుని నొసట కుంకుమ

పెట్టుకొని తిరుగుతాను. చనిపోయేటప్పుడు మీ భార్యగానే చనిపోతాను. ఇంక దయచేయండి. మనోవర్తిమాత్రం మరిచి పోకండి.

చూశావా చూశావా రామం! ఆ మనిషి ఎంతకుట్ర పన్నుకుని ఇక్కడికి వచ్చారో? ఎవరికి తెలియ వీవేషాలు? అబ్బా ఎంతకైనా సమర్థులు, మీ మగవాళ్ళు. ఏమంటావ్? ఇన్నేళ్ళనుంచీ మనసులో ముసుగులో గుద్దులాటగా వుంది. ఇప్పుడా మనిషి దొరికేసరికి యెదురుగుండా పట్టుకుని దులి పేశాను. అమ్మయ్యా. నా కోపం ఇప్పటికి చల్లారింది. ఇక వేళయింది పాఠాలకి, ఇదుగో తలుపు వేసుకో, వెళ్ళివస్తా, రామం.

---